## క్లుప్తంగా

### జూదాలు నిర్వహిస్తే చర్యలు

కొత్తపల్లి: సంక్రాంతి పేరుతో కోడి పందేలు, పేకాట, గుండాట వంటి జూదాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని గ్రామాల్లో పోలీసులు హెచ్చరికలను జారీ చేస్తున్నారు. మండలంలో ఎస్సై రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం మైకు ద్వారా పోలీస్ సిబ్బంది ప్రచారం చేశారు. కోడి పందాలు, పేకాట శిబిరాలు నిర్వహిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

### రైల్వే కార్మికుల ధర్నా



సీనియర్ సెక్షన్ ఇంజనీరు కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైల్వే ఉద్యోగులు, కార్మికులు

సామర్లకోట: నూతన పెన్షన్ విధానాన్ని వ్యతిరేకిస్తూ రైల్వే ఉద్యోగులు, కార్మికులు గురువారం ధర్నా నిర్వహించారు. ఈ మేరకు స్థానిక సీనియర్ సెక్షన్ ఇంజనీరు కార్యాలయం వద్ద పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, పెన్షన్ కార్మికుల హక్కు అని నినాదాలు చేశారు. సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మర్రి రాఘవయ్య పిలుపు మేరకు నిర్వహించిన ఈ ధర్నాకు రైల్వేలోని వివిధ కార్మిక సంఘ నాయకులు మద్దతు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ఎంప్లాయిస్ సంఘ్ కార్యదర్శి, స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ నాయకత్వం వహించగా సంఘ చైర్మన్ టి.ఈశ్వరరావు, వర్కింగ్ చైర్మన్ బి.రామకృష్ణ, ఉపాధ్యక్షులు పి.త్రినాథ్, కేవీకె గోపాలరెడ్డి, అసిస్టెంట్ కార్యదర్శులు కె. విశ్వప్రసాద్, ఎస్ సత్యనారాయణ, సంఘ గౌరవ అధ్యక్షుడు కేవీ వెంకటేశ్వరరావు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### కొబ్బరి, మామిడి ఫలసాయాలకు 19న వేలంపాట

కొత్తపల్లి: మండలంలోని వాకతిప్ప శివారు నాగులాపల్లి ఏరియా రక్షిత నీటి పథకంలో ఉన్న కొబ్బరి, మామిడి ఫలసాయం పాటను ఈనెల 19న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రభాకర రామారావు గురువారం తెలిపారు. నాగులాపల్లి పంచాయతీలో 19వ తేదీన 11.30 గంటలకు వేలం జరుగుతుందన్నారు. పాటలో పాల్గొనేవారు సాల్వెన్సీ సర్టిఫికెట్ తప్పనిసరి అన్నారు. పథకంలో ఉన్న 22 కొబ్బరి చెట్లు, 8 మామిడి చెట్లుకు పాట జరుగతుందని ఆయన తెలిపారు.

### సారా విక్రయిస్తే కఠిన చర్యలు

కొత్తపల్లి: సారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని ఎస్సై రామలింగేశ్వరరావు అన్నారు. గురువారం మాట్లాడుతూ కొండెవరం, కుతుకుడుమిల్లి, కొమరగిరి, పొన్నాడ, శ్రీరాంపురం తదితర శివారు గ్రామాల్లో కొందరు భూములను కౌలుకు తీసుకుని పొలాల్లో సారా తయారీకి అవసరమైన బెల్లం ఊటలు వేసి గట్లపై సారా తయారు చేస్తున్నారని, ఇటువంటి వాటికి భూములు ఇచ్చిన యజమానులపై కూడా కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. సారా తయారీకి వినియోగించే బెల్లం విక్రయించినా కేసులు తప్పవని అన్నారు. సారా నియంత్రించేందుకు ప్రజలు తమకు సహకరించాలని ఆయన కోరారు. శివారు గ్రామాల్లో సారా తాగి అనారోగ్యం పాలై మృతి చెందినవారి ఎందరో కుటుంబాలు దిక్కులేక రోడ్డున పడుతున్నాయన్నారు. మండలంలో పూర్తి స్థాయిలో సారాను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

### మండలంలో 59 భవనాల మంజూరు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు

సామర్లకోట: మండల పరిధిలోని 18 గ్రామాలకు సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ సెంటర్లకు 59 భవనాలు మంజూరయ్యాయని ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో పాల్గొన్నారు. ఇప్పటికే 12 భవనాలను ప్రారంభించామని, మరో 10 భవనాలు ప్రారం భానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. కాపవరం గ్రామంలో కూలిపోయిన వంతెనను నిర్మించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేశామని చెప్పారు. ప్రజలు సంక్రాంతిని ఆనందంగా జరుపుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ డి.శ్రీలలిత, పరిపాలనాధికారి వీవీ సాయిబాబు పాల్గొన్నారు.

### ట్రాఫిక్‌కు అంతరాయం

కొత్తపల్లి: పిఠాపురం–ఉప్పాడ రోడ్డులో కొత్తపల్లి యూనియన్ బ్యాంక్ వద్ద జాంధానీ చీరలు కొనుగోలు చేసేందుకు వచ్చినవారు తమ కార్లను రోడ్డుకు ఇరువైపులా నిలిపివేయడంతో గురువారం రాత్రి ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ సమస్యను ఎదుర్కొంటున్న ప్రయాణికుల కష్టాలు ఎన్నిసార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ఇచ్చిన హామీలు అమలు చేసిన ఏకైక నాయకుడు

- పారదర్శకంగా ముఖ్యమంత్రి జగన్ పాలన
- పీబీ దేవంలో గడప గడపకూ మన ప్రభుత్వంలో దవులూరి దొరబాబు



సామర్లకోట మండలం పీబీ దేవం గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో దవులూరి దొరబాబు

సామర్లకోట: ప్రజా సంకల్పయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలను, ఇవ్వని అనేక పథకాలను అమలు చేస్తున్న ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. గ్రామ సర్పంచ్ నీలపాల సత్యనారాయణ, ఉప సర్పంచ్ మలకల సత్య, ఎంపీటీసీ సభ్యులు మలకల సూరిబాబు, డాక్టరు వైబీవీ ప్రసాదరావుల ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్లుగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించడానికి రాష్ట్ర వ్యాప్తంగా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభించినట్టు దవులూరి దొరబాబు అన్నారు. గడపగడపకూ తిరిగిన సమయంలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరించేలా అధికారులు కూడా భాగస్వాములు అవుతున్నారని చెప్పారు. అర్హత ఉండి పథకాలు అందకపోతే అధికారులతో సమన్వయం చేసుకొని వారికి న్యాయం చేసేలా చేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి మరోసారి మద్దతు ఇవ్వాలని కోరారు. కుల,మత, రాజకీయాలకు అతీతంగా కరోనా పరిస్థితుల్లోనూ లబ్ధిదారులకు పథకాలు అందజేస్తున్నామన్నారు. పింఛను ఉదయమే ఇంటికి రావడంపై అనేక మంది సంతోషం వ్యక్తం చేశారని తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌కు మంజూరైన మూడు అదనపు తరగతి గదులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, ఎంపీడీఓ డి.శ్రీలలిత, మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, పార్టీ నాయకులు నాగనబోయిన రాజబాబు, సత్తిబాబు, పంచాయతీ కార్యదర్శి రామ్‌నాథ్, వీఆర్వోలు, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

# విద్య, వైద్యరంగాలకు అధిక ప్రాధాన్యం



ప్రమాద బీమా చెక్కులను అందజేస్తున్న సాయిప్రసాద్, జానీ

పెద్దాపురం: విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ అన్నారు. స్థానిక 16వ వార్డు సచివాలయం పరిధిలో గురువారం ప్రమాద బీమా చెక్కులను వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ అమీనా బీబీ అధ్యక్షతన జరిగిన సభలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గతమెన్నడూ లేవన్నారు. విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యతనిచ్చి ప్రజారోగ్య సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అనంతరం ప్రమాద బీమా చెక్కులను సాయిప్రసాద్, జానీలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కో–ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, వీఆర్‌ఓ నందూరి ప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### వాచ్‌మెన్ కుటుంబానికి ఆర్థిక సహాయం

కొత్తపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తాత్కాలికంగా నైట్ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న తాతపూడి ఆశీర్వాది ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. తన కుటుంబాన్ని గురువారం పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు పరామర్శించి రూ.40 వేల ఆర్థిక సహాయాన్ని అందజేసారు. పరామర్శించిన వారిలో మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, ఎంపీటీసీ దాకే నాగమహేశ్వరి, వైఎస్సార్ సీపీ నాయకుడు దాకే రాజ్‌కుమార్, అమీనాబాద్ సర్పంచి నక్కా మణికంఠ, ఎంపీడీఓ నందూరి ప్రభాకర రామారావు, ఈఓ పీఆర్డీ భాస్కరరావు తదితరులు ఉన్నారు.

### వృద్ధులకు చీరల పంపిణీ

కొత్తపల్లి: మండలంలోని గోర్సలో ఉన్న పురాతన సీతారామస్వామి ఆలయం వద్ద గురువారం కేవీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కరసూదుల వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. ప్రతీ సంవత్సరం ఈ గ్రామంలో చీరల పంపిణీ నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

### రాష్ట్రంలో నిర్బంధ పాలన

పెద్దాపురం: రాష్ట్రంలో నిర్బంధ పాలన అమలవుతోందని, ఇది సరైన పద్ధతి కాదని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. పీఆర్సీలో కోత పెట్టారని, సీపీఎస్ రద్దు చేస్తానన్న మాట గాలికొదిలేశారన్నారు. ఉద్యోగులు, కార్మికులు ఎటువంటి ఆందోళనలు చేయకుండా అడ్డుకునే పనిలో ప్రభుత్వం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వంతో రాష్ట్ర ప్రభుత్వం కుమ్మక్కైందన్నారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ప్రభాకరవర్మ, ఐక్య ఉపాధ్యాయ పత్రిక కన్వీనర్ గిరిధర్, గోపాలకృష్ణ, సూరిబాబు, బి.అనంతరావు, క్రాంతికుమార్ తదితరులున్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

- కుమార్తెను పండగకు పిలవడానికి వెళ్తుండగా ఘటన
- తండ్రితో పాటు, మరో గుర్తు తెలియని మహిళ మృతి



ప్రమాదంలో మృతి చెందిన గుర్తుతెలియని మహిళ, మణిబాబు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చెందుర్తి పోలవరం కాలువ సమీపంలో 16వ నంబరు జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి, గుర్తుతెలియని మహిళ మృతి చెందినట్లు ఎస్సై వినయ్ ప్రతాప్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం పిఠాపురం మండలం వెల్దుర్తికి చెందిన మేడిశెట్టి మణిబాబు (48) తన పెద్ద కుమార్తెను పండగకు పిలవడానికి తన మోటారు సైకిల్‌పై వెళ్తున్నాడు. అతని మోటారు సైకిల్ చెందుర్తి సమీపంలోకి రాగానే హైదరాబాద్ నుంచి విశాఖ వెళుతున్న ఒక కారు అతి వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో మణిబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. అతనితో పాటు మరో మహిళ ఈ ప్రమాదంలో మృతి చెందింది. ఆమె వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. మృతుడు మణిబాబుకు భార్య ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# చెకుముకి పోటీల్లో లిఖిత విద్యార్థుల ప్రతిభ



చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో విజేతలుగా బహుమతిని అందుకున్న లిఖిత విద్యార్థులు

పెద్దాపురం: జేవీవీ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా తాళ్లరేవులో నిర్వహించిన చెకుముకి జిల్లా స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్ పోటీల్లో పెద్దాపురం మండలంలోని చంద్రమాంపల్లి లిఖిత పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. జిల్లా స్థాయిలో సీనియర్స్ విభాగంలో జి.త్రిలోకేష్, జి.శివ, వి.సంధ్యలు మొదటి మూడు స్థానాలు సాధించారు. వీరికి అతిథుల చేతుల మీదుగా బహుమతిని అందుకున్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను లిఖిత స్కూల్ కరస్పాండెంట్ బండి వీర ప్రసాద్, ప్రిన్సిపాల్ మంగరాజు, ప్రైమరీ హెచ్‌ఓం ఎస్‌వీఆర్ లక్ష్మీదేవి, గంగాధరరావు, వెంకటేశ్వర్లు, కాటంరాజు అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

### సంక్రాంతి సంబరాలు



భోగి మంట వద్ద విద్యార్థినుల సందడి

పెద్దాపురం: స్థానిక శ్రీనివాస విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఎస్ఆర్ఆర్, ఎస్‌కేకేఎం కళాశాలల విద్యార్థులు గురువారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎ.చక్రవర్తి అధ్యక్షతన జరిగిన సంక్రాంతి సంబరాల్లో విద్యా సంస్థల డైరెక్టర్లు మేడిద చక్రం, కుంచే వెంకటరమణమూర్తి, పి.ఏసుబాబు, మధుసూదనరావు, బాబురావు మాట్లాడారు. అనంతరం విద్యార్థుల సంప్రదాయ క్రీడలు కబడ్డీ, ఖోఖో, మ్యూజికల్ చైర్, రంగవల్లుల పోటీలు, సంప్రదాయ వస్త్రధారణ, పాటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

# ఉపాధ్యాయ ఉద్యమంలో మరపురాని మనిషి మైనేని


ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు



మైనేని వర్ధంతి సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ ఐవీ

పెద్దాపురం: ఉపాధ్యాయ పోరాట ఉద్యమంలో ఐక్య ఉపాధ్యాయ పత్రిక వ్యవస్థాపక ప్రధాన సంపాదకుడు, అమరజీవి మైనేనీవెంకటరత్నం మరపురాని మనిషి అని ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో గురువారం మైనేని వెంకటకత్నం వర్ధంతి సభ యూటీఎఫ్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు కేవీవీ నగేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఐవీ మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యమంలో ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచి ఐక్య ఉపాధ్యాయ పత్రికను దిగ్విజయంగా నడిపించారన్నారు. సాహితి స్రవంతి అధ్యక్షుడు జ్యోస్యుల కృష్ణబాబు మాట్లాడుతూ వేమన సాహిత్యంపై ప్రసంగిస్తూ వేమన పద్యాలను ఆలపించారు. తొలుత మైనేనీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అన్నారాము, ఐ.ప్రసాదరావు, గణేశ్వరరావు, చంద్రశేఖర్, వీరబాబు, గిరిధర్ గోపాల్, సూర్యనారాయణ, శివ శంకర్, సీతారామారావు, శివశంకర్, ఎం.నాగేశ్వరరావు, బి.అనంతరావు, డి.క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నూకాలమ్మ ఆలయం స్వాధీనం



నూకాలమ్మ ఆలయానికి చెందిన షాపులను పరిశీలించిన డీసీ తదితరులు

సామర్లకోట: స్థానిక స్టేషన్ సెంటర్‌లో ఉన్న నూకాలమ్మ ఆలయాన్ని గురువారం దేవదాయ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సుమారు 30 ఏళ్ల క్రితం వరకు నూకాలమ్మ అమ్మవారు పాడుబడిన గుడిలో ఉండే వారు. దాంతో పట్టణానికి చెందిన రైతులు, ప్రముఖులు అప్పటి దేవదాయ శాఖ మంత్రి పంతం పద్మనాభం ద్వారా నూకాలమ్మ అమ్మవారి ఆలయాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేలా ఏర్పాటు చేశారు. దాంతో పట్టణ ప్రజల సహకారంతో నూతన ఆలయాన్ని నిర్మాణం చేశారు. ఆలయ సమీపంలో ఉన్న పెట్రోలు బంకు స్థలంపై వివాదం ఏర్పడటంతో పెట్రోలు బంకు నిర్వాహకులు, ఆలయ కమిటీ సభ్యులు కోర్టును ఆశ్రయించారు. దాంతో కోర్టు తీర్పు దేవాలయానికి అనుకూలంగా వచ్చింది. దాంతో నూకాలమ్మ ఆలయాన్ని దేవదాయ శాఖ స్వాధీనం చేసుకోవాలని రెండేళ్ల క్రితమే ఆదేశాలు వచ్చాయి. అయితే ఆలయాన్ని ఎవరూ స్వాధీనం చేసుకోకపోవడంతో గురువారం దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎం.విజయరాజు ఆధ్వర్యంలో ఆలయాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఆలయానికి ఉన్న పాత పెట్రోలు బంకు స్థలాన్ని ఆలయానికి చెందిన షాపింగ్ కాంప్లెక్స్‌ను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ సూపరింటెండెంట్ నాగేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ ఫణికుమార్, ఈఓ జగన్నాథశ్రీనివాసు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# యువతకు ఆదర్శంగా స్వామి వివేకానంద

సామర్లకోట: యువత స్వామి వివేకానందను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సీఐ కె.దుర్గాప్రసాద్ అన్నారు. స్వామి వివేకానంద 160వ జయంతి సందర్భంగా స్థానిక స్టేషన్ సెంటర్లో మదర్ థెరిసా వలంటరీ ఆర్గనైజేషన్ అధినేత జి.రాజు మాస్టారు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నిరంతరం శ్రమిస్తూ అంతులేని ఆత్మస్థైర్యం, ఓరిమి కలిగి ఉన్న సామాన్య ప్రజలే ఈ దేశానికి వెన్నెముకగా వివేకానందుడు ప్రచారం చేశారని తెలిపారు. తన గొప్పతనానికి మూలాధారమైన నైతిక విలువలు పాటిస్తూ అత్యంత శక్తి సామర్థ్యాలు కలిగిన కింది స్థాయి ప్రజల్లోనే భారత జాతి జీవిస్తుందన్నారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పిట్టా సత్యనారాయణ, స్వయంభారపు వీరభద్రరావు, పితాని కృష్ణ, మాజీ కౌన్సిలర్ కాళ్ల లక్ష్మీనారాయణ, మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ యజమానులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

# మూడో ఆప్షన్‌లో 700 మంది ముందుకు..

సామర్లకోట: స్థానిక జగనన్న కాలనీలో థర్డ్ ఆప్షన్‌లో 700 మంది ముందుకు వచ్చారని మున్సిపల్ కమిషనర్ సీఎంఏ నయీం అహ్మద్ అన్నారు. గురువారం సాయంత్రం హౌసింగ్ సిబ్బంది, సచివాలయ ఇంజినీరింగ్ అసిసెంట్లతో నిర్వహించిన సమావేశానికి కమిషనర్ అధ్యక్షత వహించారు. స్థానిక ఈటీసీ లేఅవుట్‌లో 2,444 మందికి ఇంటి పట్టాలు మంజూరు చేశారు. వీటిలో 1200 మంది ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. మిగిలిన వారి కోసం ప్రభుత్వం మూడో ఆప్షన్ ప్రకారం, ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలు, లబ్ధిదారులు రూ.35వేలు చెల్లిస్తే ఇళ్ల నిర్మాణం చేసి ఇస్తామని తెలిపిన విషయం విదితమే. దాంతో 750 మంది ముందుకు రాగా, ఇప్పటికే 400 మంది రూ.35వేలు చెల్లించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ ఎం.వెంకటేశ్వరరావు, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధికి కృషి చేస్తాం



సురక్షిత మంచినీటి టిన్నులు పంపిణీ చేస్తున్న దాత శ్రీనివాస్

పెద్దాపురం: మండలంలోని వాలుతిమ్మాపురం గ్రామాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని ప్రముఖ పారిశ్రామిక వేత్తలు, లలితా రైస్ ఇండస్ట్రీస్ అధినేతలు మట్టే సత్యప్రసాద్, శ్రీనివాస్ అన్నారు. గ్రామంలో మట్టే వారి ఆధ్వర్యంలో నిర్మించిన సురక్షిత మంచినీటి పథకాన్ని గురువారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సైనం బుల్లెమ్మ అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ సభలో దాతలు శ్రీనివాస్, సత్యప్రసాద్ మాట్లాడుతూ గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. అనంతరం గ్రామంలో సురక్షిత మంచినీటి వాటర్ టిన్నులను శ్రీనివాస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వరసాల శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

# కట్టుకున్న వాడే కాలయముడు

- తాగొద్దన్నందుకు భార్యపై దాడి
- బలంగా తోయడంతో మంచం కోడుకు ఢీకొని మృతి

పిఠాపురం: ఆమెకు అతనే సర్వస్వం. పుట్టింటి వారు, పిల్లలు లేక తన పతినే ప్రత్యక్ష దైవంగా భావించి జీవిస్తోంది. అటువంటి భార్యనే పొట్టన పెట్టుకున్న కాలయముడయ్యాడు ఆ ఘాతకుడు. పిఠాపురం సమీపంలో సీతారాంపురంలో చోటుచేసుకున్న ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. గత నెల 24న సీతారాంపురానికి చెందిన ఆళ్ల హేమమాలిని (36) ప్రమాదావశాత్తు జామ చెట్టుపై నుంచి కింద పడి వెన్నుముక విరిగిపోయి చనిపోయినట్లు ఆమె భర్త నారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పట్టణ పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా భర్త తాగుబోతని తేలింది. ఆ కోణంలో పోలీసులు విచారించగా నారాయణ నిత్యం కూలి పని చేసి వచ్చిన డబ్బుతో తప్పతాగి భార్యను వేధించేవాడని స్థానికులు తెలిపారు. గత నెల 24న తప్పతాగి ఇంటికి వచ్చిన భర్తను నిన్నే నమ్ముకుని ఉన్నాను. నువ్వు ఇలా తాగి వస్తే మన బతుకులు ఎలా బాగు పడతాయని నిలదీసింది. దీంతో కోపోద్రిక్తుడైన నారాయణ ఆమెను బలంగా కొట్టడంతో అక్కడే ఉన్న మంచం కోడుపైపడి ఆమె వెన్నెముక విరిగిపోయి చనిపోయిందని పోలీసుల దర్యాప్తులో తేలింది. దీంతో అనుమానాస్పద కేసుగా నమోదు చేసిన కేసును హత్య కేసుగా మార్చి నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు పట్టణ ఎస్సై జగన్మోహన్ తెలిపారు. కేసును దర్యాప్తు చేసి నిందితుడిని జైలుకు పంపిన సీఐ వైఆర్‌కే శ్రీనివాస్‌ను, ఎస్సై జగన్మోహన్‌ను జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్ బాబు అభినందించారు.

# ఆధ్యాత్మిక భావం, దేశభక్తి అలవర్చుకోవాలి



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న మల్లికార్జున స్వామి తదితరులు

పెద్దాపురం: విద్యార్థి దశ నుంచి ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతతో పాటు దేశభక్తిని అలవరచుకోవాలని భగవద్గీత ప్రచార సమితి వ్యవస్థాపకుడు మల్లిఖార్జున స్వామి అన్నారు. స్థానిక సత్తిరెడ్డి పేట భగవద్గీత ఆలయంలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని గురువారం భగవద్గీత శ్లోకాల పోటీలు నిర్వహించారు. ప్రచార సమితి ఆర్గనైజర్ సత్యకుమార్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకుని యువత ముందుకు నడవాలన్నారు. అనంతరం దేశభక్తి, దైవభక్తి పాటల పోటీల విజేతలకు వారి చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయ నిర్ణేత సంస్కృత పండిట్ దర్భా వెంకటశర్మ, ఆర్గనైజర్ సత్యకుమార్, నేతి వీరభద్రరావు, కృష్ణదేవ మనోహర్, వేదగీతామృత, అంబిక, శ్రీదేవి, రామచరణ్, పెద్దాపురం, సామర్లకోట, కాకినాడ, పిఠాపురం, మాధవపట్నం, చినబ్రహ్మదేవం, చదలాడ, గోరింట, ఆనూరు తదితర గ్రామాల విద్యార్థులు పాల్గొన్నారు.

**విజేతలు వీరే...**


స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని భగవద్గీత ప్రచార సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన భగవద్గీత శ్లోకాల పోటీల్లో పలువురు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. సబ్ జూనియర్స్ విభాగంలో మనస్విని(మాధవపట్నం) ప్రథమ, సాయినిహోల్ (కాకినాడ) ద్వితీయ, తాళ్లూరి వెంకట కామేశ్వరి (పెద్దాపురం) తృతీయ స్థానాలు సాధించారు. జూనియర్ విభాగంలో బొండాడ కమీల(కాకినాడ) ప్రథమ, భాగ్యశ్రీజ (ధవలేశ్వరం) ద్వితీయ, కౌశిల్ (మాధవపట్నం) తృతీయ స్థానాలు సాధించారు. సీనియర్స్ విభాగంలో శ్రీకాకుళపు లలిత సహస్ర( పెద్దాపురం) ప్రథమ, వినయ్ (మాధవపట్నం) ద్వితీయ, బాలాజీ (మాధవపట్నం) తృతీయ బహుమతులు సాధించి ప్రతిభ కనబరిచారు.

### హాకీ ఫైనల్స్‌లో కాకినాడ


నాగమల్లితోట జంక్షన్: ఏలూరులో ఈనెల 11 నుంచి జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ సీనియర్ మహిళ అంతర్ జిల్లాల హాకీ పోటీల్లో కాకినాడ జిల్లా జట్టు ప్రతిభను కనబరిచి ఫైనల్స్‌కు చేరుకుంది. గురువారం నిర్వహించిన సెమీ ఫైనల్స్‌లో అనంతపురం పై 4–0 స్కోర్ తేడాతో కాకినాడ జిల్లా జట్టు విజయం సాధించింది. జట్టుకు కోచ్‌లుగా పీడీ వి.రవిరాజు, పి.శేషుకుమారి, మేనేజర్‌గా దుర్గాదేవి వ్యవహరిస్తున్నారు.

# వెల్లువెత్తిన అభిమానం

- ఉత్సాహంగా ఎమ్మెల్యే దొరబాబు జన్మదిన వేడుక
- శుభాకాంక్షలు చెప్పిన అభిమానులు, ప్రజాప్రతినిధులు



ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న మున్సిపల్ చైర్ పర్సన్ గండేపల్లి సూర్యావతి, బాబీ



ఎమ్మెల్యే పెండెం దొరబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలపడానికి బారులు తీరిన అభిమానులు

పిఠాపురం: ఎమ్మెల్యే పెండెం దొరబాబు జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. వేలాదిగా తరలివచ్చిన అభిమానులు ఆయనను పూల మాలలతో ముంచెత్తారు. నియోజకవర్గంలోని పిఠాపురం మున్సిపాలిటీతో పాటు, గొల్లప్రోలు నగర పంచాయతీ, గొల్లప్రోలు, పిఠాపురం మండలాల నుంచి బారీ ఎత్తున నాయకులు కార్యకర్తలు, అభిమానులు తరలి రావడంతో పిఠాపురం జన సంద్రంగా మారింది. తొలుత ఆయన పాదగయ క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా ఆయనకు ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు, ఈఓ సౌజన్య ఆధ్వర్యంలో సుమారు 50 మంది వేద పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. స్థానిక రాజా వారి కోటలో ఆయన క్యాంపు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలను ప్రారంభించగా పలువురు వైఎస్సార్ సీపీ నేతలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. పలువురు అధికారులు ఆయనకు పుష్పగుచ్చాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ చైర్ పర్సన్ గండేపల్లి సూర్యావతి, బాబీ, వైస్ చైర్ పర్సన్లు పచ్చిమళ్ల జ్యోతి, అప్పలరాజు, కొత్తపల్లి పద్మ, బుజ్జి, జెడ్పీటీసీలు వులవకాయల నాగ లోవ రాజు, గుబ్బల తులసీకుమార్, ఎంపీపీలు కారే సుధ, శ్రీనివాసరావు, అరిగెల అచ్చియ్యమ్మ, రామయ్యదొర, కె.కామేశ్వరరావు, పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

**పలువురికి ఆర్థిక సాయం**

కొత్తపల్లి: మండలంలో మృతి చెందిన కుటుంబాలకు, అనారోగ్యం బారిన పడిన వారికి వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించి గురువారం ఆర్థిక సాయాన్ని అందించారు. అమీనబాదులో మృతి చెందిన గరికిన కొండయ్య కుటుంబానికి రూ.10వేలు, కారే నారాయణ కుటుంబానికి రూ.5వేలు, ఉమ్మిడి పోలీస్ కుటుంబానికి రూ.5వేలు, మూలపేటకు చెందిన మడదా లక్ష్మయ్య కుటుంబానికి రూ.5వేలు, ముత్తు పోలీసు కుటుంబానికి రూ.5వేలు, కొప్పిశెట్టి కుటుంబానికి రూ.5వేలు, దైలపల్లి కుటుంబానికి రూ.5వేలు, అనారోగ్యంతో బాధపడుతున్న కోనాడ సత్తిరాజుకి రూ.5వేలు, ఏడిద కామేశ్వరికి రూ.3వేలు, చేపల పేతురుకు రూ.3వేలు, గంపల రవికుమార్‌కి రూ.3వేలు తో పాటు పలువురికి ఎమ్మెల్యే పెండెం దొరబాబు ఆదేశాల మేరకు ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. మండల కో ఆప్షన్ సభ్యుడి ఆధ్వర్యంలో అమీనాబాద్ సర్పంచి నక్కా మణికంఠబాబు, మత్స్యకార నాయకులు కంబాల లక్ష్మణ్, ఉమ్మిడి జాన్ తదితరులు ఉన్నారు.